## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో చండీ హోమం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ప్రాంగణంలో హోమ గుండాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు ఈ హోమాది కార్యక్రమానికి హాజరయ్యారు. అర్చకుల మంత్రోచ్ఛరణలతో హోమాది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి, పంటలు సంవృద్ధిగా పండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 8న దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో ఆలయంలోని హుండీలను లెక్కించనున్నట్లు వివరించారు.

### నేడు ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శనివారం ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభించనున్నారు. ఈ భవనాన్ని వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి ట్రస్టు సహకారంతో రూ.4 కోట్లతో అన్ని వసతులతో నిర్మాణం చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రారంభిస్తారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ శాఖ చీఫ్ సెక్రెటరీ ఎంటీ కృష్ణబాబు, సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటారు.

### పూడికతీత పనుల పరిశీలన



పెనమలూరు: కానూరు పంటకాలువ రోడ్డుకు పక్కన ఉన్న డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపట్టారు. పంట కాలువ డ్రెయిన్ పూడుకుపోవటంతో వర్షం పడితే నీటి పారుదల జరగటం లేదు. స్థానికుల అభ్యర్థనతో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తొలుత పంటకాలువ రోడ్డును పరిశీలించారు. పొక్లయిన్‌తో పంటకాలువ రోడ్డులోని డ్రెయినేజీ పనులు శుక్రవారం ప్రారంభించారు. మురుగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపట్టామని కమిషనర్ తెలిపారు. దోనేపూడి రవి, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



పెనమలూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గంగూరులో శుక్రవారం బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కిలారు దిలీప్ ఆధ్వర్యంలో 'అమ్మ కోసం ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిని పూజించినట్లే మొక్కలను కూడా గౌరవించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, శ్రీనివాస రాజు, పాతూరి నాగభూషణం, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్, టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, పలువురు పాల్గొన్నారు.

### కారుతో ఢీ కొట్టిన మహిళపై కేసు

పెనమలూరు: నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీ కొట్టిన మహిళపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొండూరు మనోజ్, అతని భార్య ప్రతిభ కారులో 100 అడుగుల రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు, వారి కారును ఢీ కొట్టింది. కారుతో ఢీ కొట్టిన మహిళ శిల్పపై మనోజ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఏలూరు కాల్వలో కబ్జాల పర్వం



రామవరప్పాడు రైల్వేస్టేషన్ వెనుక కాలువను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణం



ఇదే మార్గంలో మరో చోట కాలువను ఆక్రమించి నిర్మించిన కట్టడం

- కాలువలో 20 అడుగుల మేర ఆక్రమించి పలు నిర్మాణాలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- ఆక్రమణదారులకు అధికారపార్టీ నాయకుల అండదండలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతం, రైల్వేస్టేషన్ వెనుక ప్రాంతంలో ఏలూరు కాల్వను ఆక్రమిస్తూ రాత్రికి రాత్రి పలు అక్రమ కట్టడాలు వెలిశాయి. కాల్వగట్టు ప్రాంతం పీఎస్‌ఆర్ కాలనీ సమీపంలో కొత్తగా అక్రమ కట్టడాలు పుట్టుకొస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. కాలువను ఆనుకుని ఉన్న ఇరిగేషన్ స్థలంలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా, ఇవేమీ వీరికి పట్టడం లేదు. ఇక్కడి ఇరిగేషన్ స్థలాన్ని సుమారు 20 అడుగులకు పైగా ఆక్రమించి ఓ వ్యక్తి ఏకంగా కాలువలో పిల్లర్లు వేసి బహిరంగంగానే నిర్మాణం చేస్తున్నాడు.

**చూసీ చూడనట్టు..**

ఈ తతంగంపై ఇరిగేషన్ అధికారులతో పాటు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో ఆక్రమణల పర్వం జరుగుతోందని, ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఆక్రమించి అమ్మేస్తూ..**

ఇదే మార్గంలో ఈ ఒక్క అక్రమ నిర్మాణం కాకుండా పలు చోట్ల కాలువను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో స్థానికంగా ఉంటున్న కొందరు తమ నివాసాలకు ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించి అక్రమంగా బయట వ్యక్తులకు లక్షల్లో అమ్ముకుంటున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తులు కాలువను కూడా ఆక్రమించి నిర్మాణాలు పూర్తి చేసి అద్దెలకు ఇచ్చుకుంటున్నారని, ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు.

**కుచించుకుపోతున్న కట్ట రోడ్డు..**

వీరి ఆక్రమణల వల్ల ఉన్న కొద్దిపాటి కట్ట రోడ్డు కుంచించుకుపోతోందని, ఫలితంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే కాల్వగట్టు ప్రాంతం కనిపించకుండా పోతుందని, సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చెత్త కుప్పల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు హిందూ శ్మశానవాటిక సమీపంలో 'చెత్త కుప్పలతో ఇబ్బందులు' శీర్షికన ఈనెల 4న ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఈ ప్రాంతంలో చెత్త డపింగ్ చేయడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోతోందని, తీవ్ర దుర్వాసన వస్తోందని, పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అంతర్గత రహదారి పక్కన చెత్త తొలగించకపోవడం, మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి పారుదల లేకపోవడం వంటి సమస్యలతో ఈ ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కార్యదర్శి ప్రసాద్ శుక్రవారం చెత్త కుప్పలను పరిశీలించారు. జెసీబీ సహాయంతో చెత్త కుప్పలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. సాక్షి చొరవతో ఈ ప్రాంతంలో చెత్త సమస్య పరిష్కారమవడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



చెత్తకుప్పల తొలగింపును పర్యవేక్షిస్తున్న సర్పంచి రాచమళ్ల పూర్ణచంద్రరావు, కార్యదర్శి ప్రసాద్

## జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీ లేఅవుట 4ను ఎమ్మెల్యే బోడెప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు వివరాలు తెలుపుతూ గత ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేసిందన్నారు. తాము ఇళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అయితే లేఅవుట్లలో ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇవ్వలేదని, వెంటనే విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఎమ్మెల్యేను లబ్ధిదారులు కోరారు. వీధి దీపాలు లేవన్నారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ కాలనీలలో మౌలికవసతులు కల్పించటానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వీధి దీపాలు వారం రోజులలో ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ తరువాత లేఅవుట్ 3ని పరిశీలించారు. వారంలో ఇక్కడ కూడా విద్యుత్ సరఫరా ఇస్తామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్‌బాబు, సూర్యనారాయణ, స్థానిక నేతలు చక్కా గోపి, కాసరనేని మురళి, కొమ్మినేని శ్రీనివాసరావు, అనుమోలు ప్రభాకరరావు పలువురు పాల్గొన్నారు.



వణుకూరులో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచి కొలుసు శిరీష ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. మురుగునీటి గుంతలలో ఎబేట్ మందును స్ప్రే చేయించారు. పారిశుద్ధ్య చర్యలు సంయుక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. మురుగునీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలు తొలగించుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని, ఏఎన్‌ఎం మంజుల, ఆశాలు దుర్గమ్మ, మేరీ, శకుంతల పాల్గొన్నారు.



తెంపల్లిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచి శిరీష, వైద్య ఆరోగ్య సిబ్బంది

## ముగిసిన న్యాక్ బృందం పర్యటన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో రెండు రోజుల పర్యటన ముగిసిందని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలియజేశారు. బెంగుళూరులోని నేషనల్ అస్సెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ప్రధాన కార్యాలయం నియమించిన ముగ్గురు సభ్యుల బృందం కాలేజీలోని వివిధ విభాగాలను, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ప్రయోగశాలలను, ప్లే గ్రౌండ్స్‌ను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే ముగ్గురు అధికారుల బృందం బుధ, గురువారం వివిధ విభాగాల ఫైల్స్‌ను పరిశీలించారు. పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాలలో ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వసతులు, వివిధ అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారని సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావుకు నివేదికను అందజేశారు.



ప్రిన్సిపాల్‌కు నివేదిక అందజేస్తున్న న్యాక్ బృందం

## ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ఆషాఢ మాసోత్సవాలు, శాకంబరీ దేవి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం ఈవో కేఎస్. రామరావు ఆవిష్కరించారు. మహా మండపం ఆరో అంతస్తులోని ఈవో ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలను ఈవో రామరావుతో పాటు స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, ఏఈవో ఎన్.రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవకు విచ్చేసిన భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

### నేటి నుంచి వారాహి నవరాత్రులు ప్రారంభం

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శనివారం సాయంత్రం 7 గంటలకు వారాహి నవరాత్రులు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ శ్రీలలిత సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తర నామాలతో పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 7న తొలి ఆషాఢ ఆదివారం సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ఆషాఢ సారెను భక్తులచే సమర్పించనున్నట్లు తెలిపారు. శ్రీఅంకమ్మ తల్లికి తొలి ఆషాఢ భోనం సమర్పించన్నుట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

### నేడు పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల క్లినికల్ కాంప్లెక్స్‌లో ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్. కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆవకాశాన్ని పెంపుడు కుక్కల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పేద వర్గాలకే ఉచిత ప్రయాణం కల్పించాలి

కంకిపాడు: పేద వర్గాలకు చెందిన మహిళలకే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సంపన్న వర్గాలకు చెందిన మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాల్సిన అవసరం లేదన్నారు. బియ్యం కార్డు కలిగి ఉన్న మగ విద్యార్థులకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని, తద్వారా విద్యార్థులపై పడే రవాణా చార్జీల భారం నుంచి పేద కుటుంబాలకు ఊరట లభిస్తుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. పోరంకి సెక్షన్‌లో సాలిపేట 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా సాలిపేట, ఏవీఎం గార్డెన్స్, సిద్ధిక్‌నగర్‌కట్ట, బందరు రోడ్డు ప్రాంతాలలో విద్యుత సరఫరా ఉండదని స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

### క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

ఉంగుటూరు: వ్యాపారాభివృద్ధి, భద్రత, ఆమెజాన్ వెబ్ సర్వీసెస్‌లు, కంపెనీలకు వర్చువలైజేషన్, ఆన్ డిమాండ్ వనరులను ఉపయోగించడానికి క్లౌడ్ కంప్యూటింగ్ దోహదపడుతుందని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి, క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుడు సీహెచ్ గోపిరాజు అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో క్లౌడ్ కంప్యూటింగ్ విత్ ఎడబ్ల్యూఎస్ విశ్లేషణ మీద ఐదురోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో క్లౌడ్ కంప్యూటింగ్ ప్రయోగాలను చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, కళాశాల డీన్ సీహెచ్ శాంతిరాణి, ఆర్అండ్‌డీ డీన్ జి.సాగర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గోపిరాజు

## దోమల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ

**జిల్లా మలేరియా అధికారి రామారావు**

కంకిపాడు: దోమల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి రామారావు అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని నెప్పల్లి గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసం సందర్భంగా దోమల నిర్మూలన చర్యలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రామారావు మాట్లాడుతూ దోమల నిర్మూలనతో వ్యాధులు దరిచేరవన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం కావటంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు రాచమళ్ల శ్యాంప్రసాద్, శ్రీధర్ కుమార్, సీహెచ్‌ఓ బిందుమాధవి, ఏఎన్‌ఎం విక్టోరియా, ఆశ కార్యకర్తలు ఝాన్సీ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.



నెప్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

## ముందు జాగ్రత్తే డయేరియా నివారణకు మందు

**డాక్టర్ మనోహర్‌రెడ్డి**

గన్నవరం రూరల్: డయేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఒక రోజులో మూడు అంతకంటే ఎక్కువసార్లు విరేచనాలు అయితే డయేరియాగా గ్రహించాలని చెప్పారు. డయేరియా నివారణకు స్వచ్ఛమైన తాగునీరు ఉపయోగించటం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవటం, మరుగుదొడ్డి వినియోగించిన తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవటం చేయాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం శరీరంలో కోల్పోయిన ఖనిజాలను అందిస్తుందన్నారు. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుందని వివరించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పాఠశాలలో కిశోర బాలికలకు అమలు చేస్తున్న పరిశుభ్రత, దానిపై విద్యాబోధన అంశాలు వివరించారు. డాక్టర్ మనోహర్‌రెడ్డి పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంటు సందర్శించారు. ఎంపీహెచ్‌ఈఓ సాంబశివరాజు, పీహెచ్‌ఎన్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, సీహెచ్‌వో శ్యామల, ఏఎన్‌ఎం అనిత, ఆశాలు సునీతా, వాణి పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్‌రెడ్డి

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత విద్యాశాఖకు చెందిన సమస్యలను ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం కింద స్కూళ్ల ఆధునీకీకరణ పనులను పూర్తిచేయాలని కోరారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ స్టాఫ్, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన శాఖల్లోని సమస్యలకు సంబంధించి వివరాలను యార్లగడ్డ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా అధికారులు పనిచేయాలని చెప్పారు. విధి నిర్వాహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని సూచించారు. వివిధ శాఖల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సదుపాయల కల్పనకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. డీవైఈవో పద్మరాణి, తహసీల్దారు పవన్‌కుమార్, ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

## ఉపాధి పనులపై ప్రజావేదిక

విజయవాడరూరల్: గత సంవత్సరం విజయవాడ రూరల్ మండలంలో ఉపాధి నిధులతో నిర్వహించిన అబివృద్ధి పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగింది. మార్చి 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు 2,505 పనులకు గాను రూ.8 కోట్ల 8 లక్షల 11 వేల 360 ఖర్చు చేశారని ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత తెలియజేశారు. ఉపాధి పనులకు గాను 5 కోట్ల 34 లక్షల 74 వేల 456 రూపాయలను ఖర్చు చేయగా, మెటీరియల్ కాంపోనెంట్‌గా 2 కోట్ల 73 లక్షల 36 వేల 904 రూపాయలను ఖర్చు చేశారన్నారు. ఉపాధి కూలీల మస్టర్లకు సంబంధించి అనేక తప్పులు జరిగినట్టు సోషల్ ఆడిట్ బృందం తమ నివేదికలను సమర్పించారు. ఉపాధి కూలీలకు చెల్లింపుల విషయంలో అనేక లోపాలు జరిగినట్లు అధికారులు తెలియజేశారు. చేసిన పనులకు బోర్డులు పెట్టకుండా పెట్టినట్లుగా బిల్లులు చేయడం, మరణించిన లబ్ధిదారులకు కూడా పింఛన్ల డబ్బులు చెల్లించడం లాంటివి జరిగినట్లు అధికారులు తెలియజేశారు. గ్రామాల్లో అర్హతలేని వారికి కూడా పింఛన్లు అందజేయడాన్ని పింఛన్ల బాధ్యతలు నిర్వహించే ఏపీఓ సీహెచ్‌వీ అప్పారావు తప్పు పట్టారు. అర్హతలేని వారికి ఎంత సొమ్ము పింఛన్ల రూపంలో అందజేశారో ఆ మొత్తాన్ని రికవరీకి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. రికవరీ సొమ్మును వెంటనే జమ చేయకపోతే జీతాల నుంచి రికవరీ చేయాల్సి ఉంటుందని జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ వి.విజయలక్ష్మి సూచించారు. ఉపాధి పథకం రికార్డుల నిర్వహణ లోపభూయిష్టంగా జరిగిందని, వీటిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పీడీ జె.సునీత చెప్పారు. ఎప్పటికప్పుడు రికార్డుల పరిశీలన చేయకపోవడం వల్లే ఇలాంటి పొరపాట్లు జరిగినట్లు గుర్తించామన్నారు. ఏడు రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. ప్రజావేదికలో ఏపీడీ వెంకటేశ్వరావు, అదనపు విజిలెన్స్ అధికారి రాణాప్రతాప్, ఇటీపీ ఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, ఈసీ శ్రీనివాసరావు, కిరణ్మయి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ జె.సునీత

## ఆంక్షలు లేకుండా కార్డులు ఇవ్వాలి

ఉంగుటూరు: భూ యజమాని అనుమతులు లేకుండా కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలురైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు కోరారు. రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలో భూ అధీకృత చట్టాన్ని అనుసరించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేసేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.